బానాది, బల్లంకి సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ పర్యవేక్షణ సిహెచ్ సూర్యనారాయణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బానాది, బల్లంకి గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం పర్యవేక్షించారు. బుధవారం సాయంత్రం లోపు 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలను సందర్శించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలి. అన్ని రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఫ్యామిలీ కార్డు సర్వేను జనవరి 12లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించి, అర్హులైన ప్రతి జాబు కార్డు హెూల్డర్‌కు 100 పని దినాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాబు కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ పనికి హాజరై, రోజుకు రూ.307 వచ్చే విధంగా ఉపాధి పనులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు గొంప తులసి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఖమ్మంలో18న జరిగే సిపిఐ శతవసంతాల వేడుకలను జయప్రదం చేయండి

సిపిఐ జిల్లా కార్యదర్శిఒమ్మి రమణ పిలుపు

విశాలాంధ్ర-బొబ్బిలి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా 2026జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో శతవసంతాల వేడుకలు జరుగుతున్నాయని ఈ యొక్క వేడుకల్లో కార్మికులు. కర్షకులు ప్రజలు యువజనులు.విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ కోరారు. బుధవారం పూల్ బాగ్ సెంటర్ వద్ద సిపిఐ శతవసంతాల వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల విడుదల చేస్తూ ప్రచార%శీ% నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న ఉత్తరప్రదేశ్ లోని కాన్పూర్లో పార్టీ ఆవిర్భవించిందని. 2026కు వందేళ్లు నిండు ఉన్నాయని. ఈ 100 ఏళ్ల ప్రస్థానంలో ఈ దేశంలో దోపిడీ పీడనలు లేని సోషలిస్ట్ సమాజ లక్ష్యంగా పార్టీ పనిచేస్తుందని. నిత్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నటువంటి ప్రజా వ్యతిరేక విధా నాలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేసి ప్రజలకు రావాల్సిన హక్కులు సాధిస్తున్నా మని. నేటి పాలకుల స్వప్రయోజనాల వలన నిరుద్యోగం తారస్థాయికి చేరిందని విద్యా వైద్యం వ్యాపారంగా మారిపోయాయని అన్నారు. బిజెపి పాలనలో రాజ్యాంగం కల్పించిన భావ స్వాతంత్రం అడుగంటిపోయిందని. నిత్యం అణగారిన వర్గాలు అయినటువంటి దళిత మైనారిటీల పైన నిత్యం దాడులు జరుగుతూనేఉన్నాయని. మతోన్మాదం రాజ్యమేలు తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న మునకాల శ్రీనివాస్. సిపిఐ పట్టణ నాయకులు గొల్లపల్లి తౌడు. లచ్చన్న బీహాన్. జీర. అప్పలనాయుడు తదితరులు

గరివిడి పశు వైద్య కళాశాలలో తృతీయ వార్షిక అంతర కళాశాల క్రీడా దినోత్సవం

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక పశు వైద్య కళాశాలలో తృతీయ వార్షిక అంతర కళాశాల క్రీడా దినోత్సవాన్ని కళాశాల అధిపతి ప్రొఫెసర్ మక్కెన శ్రీను అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చీపురుపల్లి డివిజన్ డి.ఎస్.పి. ఎస్. రాఘవులు, శ్రీరామ్ విద్యాపీఠ్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి. రవి, చీపురుపల్లి డివిజన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్ రావు హాజరయ్యారు. కార్యక్రమానికి ముందుగా గౌరవ అతిథులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా దినోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సర్వాంగీణ అభివృద్ధిలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడంలో క్రీడల అవసరం ఎంతో ముఖ్యమని తెలిపారు. తదుపరి విద్యార్థులచే మార్చ్‌పాస్ట్, అథ్లెట్స్ ఓత్, క్రీడా జ్వాలా కార్యక్రమాలు నిర్వహించగా, ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. కార్యక్రమం చివరలో వివిధ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ%--%విద్యార్థులకు గౌరవ అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ క్రీడా దినోత్సవంలో మొత్తం 350 మంది విద్యార్థులు పాల్గొనగా, వారిలో 30 మంది బంగారు పతకాలు, 30 మంది రజత పతకాలు, 30 మంది కాంస్య పతకాలు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. కళాశాల ఓ.ఎస్.ఏ. డాక్టర్ అంబేద్కర్, అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వృద్ధురాలు అదృశ్యం...

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని రామస్వామిపేట గ్రామానికి చెందిన పత్రి రామయ్యమ్మ (70)గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 24న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైన ఘటన కలకలం రేపుతోంది.వివరాల ప్రకారం రామయ్యమ్మ తన అన్నయ్య ఇంటికి వెళ్తానని కుటుంబ సభ్యులకు చెప్పి లక్కవరపుకోట మండలం కిత్తన్నపేట గ్రామంకు బయలుదేరింది. అయితే అక్కడికి చేరుకోలేదని కుటుంబ సభ్యులు గమనించారు. మరుసటి రోజు విశాఖపట్నం గోపాలపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో రామయ్యమ్మ కనిపించిందని పరిచయస్తుల ద్వారా సమాచారం అందింది.దీంతో కుటుంబ సభ్యులు వెంటనే గోపాలపట్నం, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు.దీంతో రామయ్యమ్మ కుమారుడు పత్రి ఎర్రినాయుడు గురువారం వల్లంపూడి పోలీస్ స్టేషన్లో తన తల్లి కనిపించుట లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై ఎస్.సుదర్శన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. రామయ్యమ్మ ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను గానీ,ఆమె కుటుంబ సభ్యులను గానీ సంప్రదించాలని పోలీసులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కేసు నమోదు చేసిన వల్లంపూడి ఎస్సై సుదర్శన్

విశాలాంధ్ర-వేపాడ: మండలం పరిధిలోని కొత్తవలస-దేవరాపల్లి రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఇందుకు సంబంధించి స్థానికులు వల్లంపూడి పోలీసులు అందించిన వివరాల మేరకు దేవరాపల్లి మండలం కొత్తూరు ముత్యాలమ్మ పాలెం గ్రామానికి చెందిన చౌడువాడ దేముడునాయుడు(23) బిర్యానీ తినేందుకు అదే గ్రామానికి చెందిన గంధము మహేష్(23) తో కలిసి స్ప్లెండర్ ద్విచక్ర వాహనంపై కుమ్మపల్లికి వెళ్లారు. తిరిగి వస్తున్న సమయంలో కొత్తవలస-దేవరాపల్లి రోడ్డుపై కుమ్మపల్లి గ్రామం దాటిన తరువాత ఉన్న మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించక బైక్ నడుపుతున్న గంధం మహేష్ సడన్‌గా బస్సును చూసి ఒక్కసారిగా బ్రేక్‌వేయడంతో వెనుక కూర్చున్న దేముడునాయుడు అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. ఈ ఘటనలో దేముడునాయుడుకు తలకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వల్లంపూడి ఎస్సై ఎస్ సుదర్శన్, తెలిపారు.

ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-దత్తిరాజేరు :మండల పరిధిలో గల గడసాం గ్రామానికి చెందిన సింగారపు లచ్చుమ్మకు స్పౌజ్ కేటగిరి కోటలో ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ టిడిపిసీనియర్ నాయకులు మజ్జి మహేష్, మాజీ సర్పంచ్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు. లబ్ధి దారులు మాట్లాడుతూ నా భర్త సింగారపు అప్పన్న గత నెలలో మరణించారాని అతి తక్కువ కాలంలోనే నాకు స్పౌజ్ పెన్షన్ తెప్పించి సహకరించిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గారికి, తెలుగుదేశం నాయకులకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను

పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర-బొబ్బిలి: నూతన సంవత్సరం సందర్భంగా ఒకరోజు ముందుగానే పింఛను అందించిన కూటమి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం ప్రతీ నెల 1వ తారీకు సామాజిక భద్రత కోసం వృద్ధులు,వితంతులు,వికలాంగులకు అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఈ నెల ఒకరోజు ముందుగానే పంపిణీ చేసింది.. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) బొబ్బిలి పట్టణం 5వ వార్డులో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛను అందజేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు , నంబియార్ వేణుగోపాల రావు గారు, 5వ వార్డు కౌన్సిల్ సభ్యులు వెలగాడ హైమవతి , టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ చరిత్ర లో 2025 చరిత్రాత్మక మైలురాయి

పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు దయానంద్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: 2025 వ సంవత్సరం పారా స్పోర్ట్స్ చరిత్రలో ఓ చరిత్రాత్మక మైలురాయి గా నిలిచిపోనుందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అన్నారు. ఈ ఏడాదిలో జరిగిన అన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు గతంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధిక పతకాలు గెలుచుకున్నారని అన్నారు. కేవలం పతకాలు మాత్రమే కాకుండా జీ. ఓ. నెంబర్ 4 ద్వారా సాధించిన ప్రభుత్వ ఉద్యోగా లతో జీవితాలు కూడా మారాయని అన్నారు. ఇదే స్ఫూర్తి తో 2026 లో అడుగుపెడుతున్న వేళ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దివ్యాంగ క్రీడాకారులను ఇంతగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వా నికి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామిలకు కృతజ్ఞతలు తెలియ జేస్తూ జిల్లా లో వున్న పారా క్రీడాకారులకు, ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.

టీడీపీ ఉత్తమ కార్యకర్తగా బొట్టరమణ

విశాలాంధ్ర-జామి: తెలుగుదేశం పార్టీలో ఉత్తమ సేవలు అందించిన కార్యకర్తలకు అధిష్టానం ప్రశంసా పత్రాలను అందజేస్తోంది. అందులో భాగంగా మండల కేంద్రమైన జామిలోని బిసి కాలనీకి బొట్ట రమణకు ఈప్రశంసా పత్రాన్ని ప్రక టించారు. ఈమేరకు బుధవారం ఎస్‌కోట ఎమ్మెల్యే కోళ్ళలలితకుమారి చే ఈప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. అధిష్టానం నుంచి తాను చేసిన సేవలకు తగిన గుర్తింపు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు బొట్ట రమణ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్న రమణకు పలువురు నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

జిల్లా జడ్జి సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-విజయనగరం, కంటోన్మెంట్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. బబీత జిల్లా సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేసారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. వీరికి పలు చట్టాలపై అవగాహన కల్పించారు.ఖైదీల పట్ల సిబ్బంది గాని తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని గౌరవ సుప్రీంకోర్టు ఇచ్చిన జడ్జిమెంట్ ను గూర్చి తెలియజేశారు. ఆ విధంగా ఖైదీల పట్ల వివక్షత చూపించిన యెడల కఠినమైన చర్యలు ఉంటాయని, ఆ విషయమై జైలు సూపరిడెంట్ అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేశారు.జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్స్ నిర్వహిస్తున్న విధులనుపర్యవేక్షించారు .జైల్ క్లినిక్లను సందర్శించే న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు నిర్వహిస్తున్న విధులను గురించి ఆరా తీశారు. జైలులో ఉన్న ఖైదీల వివరాలను ప్రతి ఒక్కరిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేర ప్రవృత్తిని విడనాడాలని మారుమనస్సు పొంది మంచి పౌరులుగా మెలగాలని హితవు పలికారు. సకాలంలో న్యాయ సహాయము అందించడానికి జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్లను ఏర్పాటు చేశామని వాటిని సక్రమంగా కొనసాగించాలని తెలియజేశారు. జైల్లో ఉన్న ముద్దాయిలకు ఉచిత న్యాయ సహాయము అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ముఖ్య కర్తవ్యం అని తెలియజేశారు. రిమాండ్ లో ఉన్న ముద్దాయిలకు ఎవరు న్యాయవాది లేకుండా ఉండకూడదని అట్టివారికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ న్యాయ వాదిని ఉచితంగా అందిస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. జైలులో అమలవుతున్న సౌకర్యాలు గురించి ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. వంటగదిని భోజనశాలను పరిశీలించారు. స్టోర్ రూమ్ సందర్శించి వంట సరుకులను పప్పు దినుసులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ అకస్మిక తనికి తనిఖీలో భాగంగా నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి బి అప్పల స్వామి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి ఏ. కృష్ణప్రసాద్ , సబ్ జైలు సూపరింటెండెంట్ కే ఎస్ ఎన్ మూర్తి,లీగలేడు కౌన్సిల్స్,పారా లీగల్ వాలంటీర్స్ పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామ సభలలో కొత్త పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ

కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం: జిల్లాలో రీసర్వే పూర్తి అయిన గ్రామాలలో రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకములు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. జిల్లాలోని అన్ని మండలములలో, అధికా రులు ముందుగా నిర్దేశించిన గ్రామాలలో మరియు తేదీలలో, 02.01.2026 నుండి 09.01.2026 వరకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా సంబంధిత అధికారులు కొత్త పట్టాదారు పాసు పుస్తకములను పంపిణీ చేయనున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రీసర్వే పూర్తైన గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, తమ గ్రామాలలో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభలకు హాజరై కొత్త పట్టాదారు పాసు పుస్తకములను పొందవలసినదిగా కలెక్టర్ కోరారు.

2 నుంచి రెవెన్యూ గ్రామ సభలు

విశాలాంధ్ర-గుర్ల: మండలంలో రెవెన్యూ గ్రామాల్లో ఈనెల 2 తేదీ నుంచి 9వ తేదీ వరకు రెవిన్యూ గ్రామసభల నిర్వహించడం జరుగు తుంది. ఈ గ్రామ సభల ద్వారా రైతులకు పట్టాదారు పుస్తకాలు అందించడం జరుగు తుందని తాసిల్దార్ పి. ఆదిలక్ష్మి బుధవారం తెలిపారు. ముందుగా గ్రామాల్లో దండోరాలు వేయించాలని వీఆర్వోలకు ఆదేశించారు.

బురద నీరే వీరికి తాగునీరు..!

మంచినీరు వచ్చేలా చేయాలంటూ భర్తవానిపాలెం గ్రామస్తుల మొర

గ్రామసభల్లో చెప్పినా పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి తీరుపై ఆరోపణలు

విశాలాంధ్ర-వేపాడ : మండలంలోని, నీలకంఠరాజపురం పంచాయితీ శివారు భర్తవానిపాలెం గ్రామంలో రక్షిత మంచినీటి కొళాయి ల నుంచి బురద కలిసిన నీరు సరఫరా అవుతుండడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను గ్రామసభల్లో పలుమార్లు ప్రస్తావించి నప్పటికీ పంచాయతీ కార్యదర్శి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు.గ్రామంలో రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన బోరుబావి నుంచి ట్యాంకుకు స్వచ్ఛమైన నీరే చేరుతున్నప్పటికీ, ట్యాంకు నుంచి వీధుల్లోని ఇంటింటి కొళాయిలకు వెళ్లే పైపులైన్లు డ్రైనేజీ కాలువల్లో మునిగి ఉండటంతో లీకుల ద్వారా మురుగు నీరు, కలిసిపోతున్నదని గ్రామస్తులు తెలిపారు.ఫలితంగా కొళాయిల్లో నుంచి బురద నీరు వస్తోందని, ఆరోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని పలు మార్లు పంచాయతీ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని గ్రామస్తులు ఆరోపించారు.పండుగ రోజుల నేపథ్యంలో అయినా మండల పరిషత్ అభివృద్ధి అధికారులు జోక్యం చేసుకుని డ్రైనేజీ కాలువల్లో ఉన్న రక్షిత మంచినీటి పైపులను వెంటనే సురక్షిత ప్రాంతానికి మార్చాలని కోరుతున్నారు.ఈ అంశంపై పంచాయతీ కార్యదర్శి టి. కన్నంనాయుడును వివరణ కోరగా, భర్తవానిపాలెం మంచి నీటి ట్యాంకు నుంచి బురద నీరు వస్తోందన్న విషయం తన దృష్టికి రాలేదని తెలిపారు.మూడు రోజుల క్రితమే మంచినీటి ట్యాంకును శుభ్రపరిచామనిచెప్పారు.అయితే గ్రామంలో రక్షిత మంచినీటి పథకం పైపులు డ్రైనేజీ కాలువల్లో ఉండటం వాస్తవమేనని అంగీకరించిన ఆయన, వాటిని త్వరలోనే సురక్షిత ప్రదేశానికి మార్చే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సూపరిపాలన తొలి అడుగులో ఐటీడీపీ నేత చక్కా కిరణ్ కుమార్ కు రాష్ట్ర స్థాయి గుర్తింపు

విశాలాంధ్ర-శృంగవరపుకోట(రూరల్): తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ వార్డులను ఎంపిక చేసే ప్రక్రియలో ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్ ఉత్తమ కార్యకర్తగా ఎంపికయ్యారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, యువ నాయకుడు నారా లోకేష్ మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చక్కా కిరణ్ ప్రతిభను గుర్తించి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ ప్రశంసాపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి చక్కా కిరణ్ కు అందజేసారు ఈ సందర్భంగా పార్టీ కార్యక్రమాల అమలులో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను ప్రోత్సహించడమే సూపరిపాలన లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ గౌరవం దక్కిన సందర్భంగా ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి చక్కా కిరణ్, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి రాంప్రసాద్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయనగరం: ప్రజాప్రతినిధులకు, జిల్లా ప్రజలకు, అధికారులకు కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి నూతన సంవత్సరం 2026 శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కి శుభాకాంక్షలు తెలియజేయ వలసిన వారు కేవలం నోట్‌బుక్స్, పెన్నులు ద్వారా మాత్రమే శుభాకాంక్షలు చెప్పాలని, బొకేలు, స్వీట్స్, పూల దండలు తీసుకు రావద్దని ఫెసీ వర్గాలు తెలిపారు. ఉదయం 9.00 గంటల నుండి 11.00 గంటల వరకు కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ అందుబాటులో ఉంటారని వారు తెలిపారు.

ఆర్డీవో రామ్మోహన్ రావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామ అవగాహన ర్యాలీ కు రైతుల నుండి విశేష స్పందన

విశాలాంధ్ర-బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులు భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మక అమలు చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టు రీ సర్వే గ్రామ సభ అవగాహన ర్యాలీ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడానికి బుధవారం మండల పరిధి పిరిడి గ్రామంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ శివుని నాయుడు అధ్యక్షతన అవగాహన ర్యాలీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అవగాహన ర్యాలీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్ రావు అవగాహన ర్యాలీలో పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి నాగరత్నం అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో 'అఖండ-2' సందడి..

కార్యకర్తలతో కలిసి సినిమా వీక్షించిన రామ మల్లిక్ నాయుడు



విశాలాంధ్ర-చీపురుపల్లి: నియోజకవర్గ కేంద్రంలోని స్థానిక థియేటర్‌లో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు పార్టీ కార్యకర్తలు కలిసి 'అఖండ-2' చలనచిత్రాన్ని వీక్షించారు. నందమూరి బాలకృష్ణ నటించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న టీడీపీ శ్రేణుల్లో భారీ ఉత్సాహం నెలకొంది. సినిమా ప్రారంభానికి ముందు థియేటర్ వద్ద బాణసంచా కాల్చి,కేక్ కట్ చేసి జై బాలయ్య.. జై టీడీపీ అంటూ నినాదాలతో హెూరెత్తించారు. రాజకీయ కార్యక్రమాలతో నిరంతరం బిజీగా ఉండే కార్యకర్తలకు ఈ సినిమా ప్రదర్శన ఒక ఉల్లాసాన్ని ఇచ్చిందని, అందరం కలిసి ఇలా సినిమా చూడటం సంతోషంగా ఉందని యువ నాయకులు రామ మల్లిక్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన యువ నాయకులు, పార్టీ ముఖ్య నేతలు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త నిర్మూలనపై జనవరి 5న ప్రత్యేక గ్రామసభలు

విశాలాంధ్ర-గరివిడి: ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్తలేని గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దే లక్ష్యంతో జనవరి 5న గరివిడి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.వి.బి. సుబ్రహ్మణ్యం తెలిపారు.ఈ గ్రామసభలు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలు, రచ్చబండ వేదికల వద్ద నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చెత్త సేకరణ, వర్గీకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడం, గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.గ్రామసభలను విజయవంతం చేయడంలో పంచాయతీ సర్పంచులు, ప్రాదేశిక సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు చురుకుగా పాల్గొనాలని ఆయన కోరారు.

శ్రీ భవిష్య స్కూల్లో ఘనంగా ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

విశాలాంధ్ర-రాజాం: స్థానికంగా ఉన్న శ్రీ భవిష్య స్కూల్లో నూతన సంవత్సర వేడుకలు ఎంతో ఉత్సాహభరితంగా, ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్కూల్‌లోని ప్రతి తరగతిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించి హ్యాపీ న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొని నూతన సంవత్సరాన్ని సంతోషంగా స్వాగతించారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, చదువులో మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణంలో కొనసాగాయి.

ఎంపీపీ ఎన్నిక సజావుగా సాగేందుకు అందరూ సహకరించండి



విశాలాంధ్ర-బాడంగి: ఈనెల ఐదున నిర్వహించిన ఎంపీపీ ఎన్నిక సజావుగా జరిగేం దుకు రాజకీయ పార్టీలని పూర్తి సాయి సహకారాన్ని అందించాలని ఎండిఓ రామకృష్ణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలు తో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీపీ ,వైస్ ఎంపీపీ పదవులను ఎంపిక కోసం ఎన్నికల నిర్వహించమని ఎన్నికల కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని అన్నారు. ఈ విషయమే అన్ని పార్టీలు వారికి సమాచారాన్ని తెలియ జేసామన్నారు.. మండలంలో ఉన్న 14 ఎంపీటీసీ సభ్యులకు కూడా తెలియజేశా మన్నారు. బందోబస్తు ఏర్పాటు చేయమని ఎస్సై తారకేశ్వరరావు కూడా తెలియజేశామని ఆయన తెలిపారు. ఎన్నిక ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

పెనుబాకలో రోడ్డుపక్కన చెత్త తొలగింపు

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలం పెనుబాక గ్రామంలో బుధవారం రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త కుప్పలను డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. ప్రతి ఇంటికి రోజూ వెళ్లి చెత్త సేకరిస్తున్నప్పటికీ కొందరు రోడ్డు పక్కన చెత్తను పడేస్తున్నారని ఆయన తెలిపారు. ఇలా చేయడం వల్ల గ్రామంలో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడి, గ్రామస్థులే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని అవగాహన కల్పించారు. ఇప్పటికైనా గ్రామ ప్రజలు పారిశుద్ధ్య సిబ్బందికి పూర్తి సహకారం అందించి, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు.

గ్రామస్తుల ఆరోగ్యమే. నా ప్రధాన లక్ష్యం

గ్రామ నాయకుడు బావి శెట్టి నారాయణరావు.

విశాలాంధ్ర-పూసపాటిరేగ: పూసపాటిరేగ మండలం కొప్పెర్ల గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడు తున్న వారికి వైఎస్సార్సీపీ నాయకుడు భావిశెట్టి నారాయణరావు నెల నెల పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భావిశెట్టి నారాయణరావు మాట్లాడుతూ, గ్రామంలో క్షయ వ్యాధితో బాధపడుతున్న బాధితులు పూర్తిగా ఆరోగ్యవంతులు అయ్యే వరకు ప్రతి నెల పౌష్టికాహారం అందజేస్తామని తెలిపారు. క్షయ వ్యాధిని జయించడంలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

వంగరలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ



విశాలాంధ్ర-వంగర: మండలం వంగర గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ జెడ్పిటిసి సభ్యులు ఎంపీపీ మరియు విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బొత్స వాసుదేవరావు నాయుడు గారు మరియు కార్యకర్తలు అభిమానులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు.

పారా స్పోర్ట్స్ చరిత్ర లో 2025 చరిత్రాత్మక మైలురాయి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : 2025 వ సంవత్సరం పారా స్పోర్ట్స్ చరిత్రలో ఓ చరిత్రాత్మక మైలురాయి గా నిలిచిపోనుందని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కె. దయానంద్ అన్నారు. ఈ ఏడాదిలో జరిగిన అన్ని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో జిల్లాకు చెందిన పారా క్రీడాకారులు గతంలో ఎప్పుడూ లేని విధంగా అత్యధిక పతకాలు గెలుచుకున్నారని అన్నారు. కేవలం పతకాలు మాత్రమే కాకుండా జీ. ఓ. నెంబర్ 4 ద్వారా సాధించిన ప్రభుత్వ ఉద్యోగాలతో జీవితాలు కూడా మారాయని అన్నారు. ఇదే స్ఫూర్తి తో 2026 లో అడుగుపెడుతున్న వేళ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. దివ్యాంగ క్రీడాకారులను ఇంతగా ప్రోత్సహిస్తున్న ప్రభుత్వానికి, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి. రామస్వామి లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లా లో వున్న పారా క్రీడాకారులకు, ప్రజానీకానికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారు.

సంక్షేమం,అభివృద్ధి ధ్యేయంగా చంద్రబాబునాయుడు పాలన

విశాలాంధ్ర -గుర్ల : సంక్షేమము అభివృద్ధి ధ్యేయంగా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని చీపురుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం కొండగండ్రేడు గ్రామంలో పది లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ డ్రైనేజీ ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వితంతువులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛలను అందజేశారు.అలాగే గడిగడ్డ మత్స్యకార సంఘాల సభ్యులకు పింఛన్లను ఆయనతో పాటుగా పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు అందజేశారు.ఈ సందర్భంగాఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల కొరకు 55 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని.రాష్ట్రంలో గాడి తప్పిన పరిపాలనను గాడిలో పెడుతున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోని లేని విధంగా మన రాష్ట్రంలో 4000 రూపాయలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇచ్చిన హామీల మేరకు ప్రతి పథకాన్ని అమలు చేస్తూ తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతు భరోసా తదితర పథకాలన్నీ సకాలంలో అందజేసి ప్రజా పరిపాలన అందజేస్తున్న బా మన ముఖ్యమంత్రి చంద్రబాబు అని అన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్య గ్రామస్తులు తెలపడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి సకాలంలో సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో కు ఆదేశించారు. జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించే నాయకత్వం కూటమి ప్రభుత్వంతో సధ్యమవుతుందని తెలిపారు.అక్కడికి గ్రామస్తులు సభలో మాట్లాడుతూ పైన తోట పిల్ల ఊరు పైన తోటపల్లి కాలువ ఊరు ముందు ఉత్తరాంధ్ర సృజన స్రవంతి పథకం రావడంతో భూములు పూర్తిస్థాయిలో కోల్పోతున్నామని తెలిపారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధిలో ఆటంకాలు జరుపకుండా సంక్షేమానికి ప్రజలంతా కట్టుబడి ఉండాలని వివరించారు. కార్యక్రమంలో తెట్టంగి పిఎసిఎస్ అధ్యక్షులు కిరణ్ కుమార్ రాజు, గూడెం సొసైటీ అధ్యక్షులు పిల్లా అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మహేష్ ,చీపురుపల్లి నియోజకవర్గం ఎఎంసీ ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, ఎంపీడీవో రవికుమార్, తాసిల్దార్ ఆదిలక్ష్మి ,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

విశాలాంధ్ర -చీపురుపల్లి :కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసి పేదల ఉపాధికే ఎసరు పెట్టేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి పని లేకుండా చేసే కుట్ర పన్నుతున్నాయి వైస్సార్ పార్టీ పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు.మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్చి పథకాన్ని నిర్వీర్యం చేసి పేదలకు ఉపాధి పని లేకుండా సవరణలు చేసారు అని అన్నారు. ,దీని వలన మళ్ళీ వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రజలు కూలి పనులకు వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది అని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు అన్నారు,20 ఏళ్ళ క్రితం అప్పటి యుపిఏ సారధ్యం లో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో వై యస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఆనాటి విజయనగరం ఎంపీ బొత్స ఝాన్సీ లక్ష్మి ఈ పథకం మొట్టమొదటిసారిగా వెనుక బడిన ప్రాంతం విజయనగరం జిల్లా లో ఈ పథకం ప్రవేశ పెట్టారు అని తెలిపారులిఈ పథకం కోట్లాది మందికి జీవనధారమైంది అని పేర్కొన్నారు,ఇంతకాలం డిమాండ్ ఆధారిత మైన పథకం ఇప్పుడు సప్లై ఆధారిత పథకం అవుతుంది అని అన్నారు,ఉపాధి ఒక హక్కుగా వున్న ఈ పథకం పంచాయతీ ల నిర్ణయాధికారాన్ని కొల్ల గొట్టి పథకాన్ని ఆర్థిక భారాన్ని నెడుతూ రాజ్యాంగ బద్ధంగా దక్కిన పని హక్కును వేతన కార్మికులు ఈ కొత్త బిల్లుతో వారి హక్కును కోల్పోతారు అని ఆవేదన చెందారు,ఇప్పటి వరకు గ్రామాల్లోనే డిమాండ్ చేస్తూ పనిచేసుకుంటున్న ప్రజలు ఇకపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాలకు ఉపాధి పనులు కేటాయించని పక్షంలో మునుపటివలే వేరే ప్రాంతాలకు వలసలు తప్పవని అన్నారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బిల్లును వెనక్కి తీసుకోక పోతేలి లితీవ్రపరిణామాలు తప్పవని ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదని వలిరెడ్డి శ్రీనివాసనాయుడు హెచ్చరించారు

సామాజిక పింఛన్లు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదే

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర - లక్కవరపుకోట: సామాజిక భద్రత పింఛన్లు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని, కాసాపేట గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ నూతన సంవత్సరంలోకి అడుగుపెట్టేలా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని అందులో భాగంగా ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేపట్టడం జరిగిందని ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఎన్టీ ఆర్ కే చెల్లిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఇంటికి అందించే పింఛన్లు ప్రస్తుతం ఒకరోజు ముందుగానే మీకు అందిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం కంటే మెరుగైన రీతిలో ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన క్రమం తప్పకుండా పంపిణీ చేస్తున్న ఘనత కూటమి సర్కార్ కె చెల్లిందని అన్నారు. అలాగే ఇంటి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకుంటున్నామని అన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్న తనకు తెలియజేయాలని సూచించారు. అలాగే అర్హులైన వారికి త్వరలో కొత్త పింఛన్లు మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. అనంతరం తన క్యాంపు కార్యాలయంలో విలేకరులకు ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని దానికి నిదర్శనమే తెలుగుదేశం పార్టీ అని ఆమె అన్నారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యూనిట్ బూత్ ఇన్చార్జీలకు ప్రశంస పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేష్ పంపించిన ప్రశంస పత్రాలు స్వయంగా కష్టపడిన వారికి అందజేయడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ విస్తృతంగా మై టిడిపి యాప్ వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

52

డిసెంబర్ 31 నే మంత్రిచే పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర - గంట్యాడ :మండలం బోనంగి గ్రామంలో గౌరవ ఎన్ఆర్ఐ, ఎస్ఈఆర్పి, ఎంఎస్ఎంఈ శాఖల మంత్రివర్యులు శ్రీ కొండపల్లి శ్రీనివాస్ నెలవారి సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా మరియు నూతన ఆంగ్ల సంవత్సరాది కారణంగా ఒకరోజుముందే అర్హులైన పింఛన్దారులకు పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్లను స్వయంగా అందజేశారు. బోనంగి గ్రామానికి చెందిన షేక్ సన్నమ్మకు మొదటి పెన్షన్ అందజేశారు అనంతరం పీడీటీఆర్డీఏ శ్రీ శ్రీనివాస్ పాణి ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ పింఛన్లు భారీగా పెంచడం జరిగిందని అన్నారు అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా నిర్మాణాత్మక సంతృప్తి విధానములో మంజూరు చేస్తున్నామని అన్నారు.మహిళా సంఘాలను ఉద్దేశించి మాట్లాడుతూ, మహిళలు బ్యాంకు లింకేజ్, స్త్రీ నిధి, ఉన్నతి, సీఐఎఫ్ వంటి రుణాలను సమర్థవంతంగా వినియోగించుకొని జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకుంటూ ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షులు శ్రీ కొండపల్లి భాస్కర్ నాయుడు, గంట్యాడ మండలం ఏపీఎం కోరుకొండ సులోచన దేవి, అల్లువిజయ్ కుమార్, చిన్న రామనాయుడు, వెంకట్రావు, పాపూ నాయుడు, శంకర్రావు తదితర కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.అలాగే మండల స్థాయి అధికారులు, సీసీలు, వివోఏలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఐసిడిఎస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర: మెంటాడ:ఐసిడిఎస్ హైయర్ వెహికల్స్ ఓనర్స్ అండ్ డ్రైవర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ను స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు సాలూరు పట్టణంలోని ఆమె స్వగృహం వద్ద శుక్రవారం ఆవిష్కరించారు.ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఐసిడిఎస్ కార్యక్రమాల విజయవంతమైన అమలులో వాహన డ్రైవర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. స్త్రీలు, చిన్నారులు, గిరిజన సంక్షేమానికి సంబంధించిన పథకాలు క్షేత్రస్థాయికి చేరడంలో డ్రైవర్ల సేవలు అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో కూడా శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూనియన్ నాయకులు గదుల సత్యనారాయణ, వై. రాంబాబు, అప్పలనాయుడు, గణపతి తదితరులు పాల్గొని మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అసోసియేషన్ సభ్యులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

లెక్కలమామయ్యతో ప్రత్యేక తరగతులు

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్:ఈ నెల నాలుగో తేదీన విజయనగరం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో హైదరాబాద్ వాస్తవ్యులు,ప్రసిద్ధి చెందిన లెక్కల ఉపాధ్యాయుడు చంద్రయ్య అలియాస్ లెక్కల మామయ్యతో ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులకు మ్యాథమెటిక్స్ పై ప్రత్యేకమైన శిక్షణ తరగతులు నిర్వహించబడునని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ తెలిపారు.ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను బుధవారం కంటోన్మెంట్ గురజాడ పాఠశాలలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా జెవివి జిల్లా అధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ లెక్కల మామయ్యగా ప్రసిద్ధి చెందిన చంద్రయ్య అంకెల గారడీతో లెక్కలను సులభ పద్ధతులు విద్యార్థులకు ఏ విధంగా బోధించాలో శిక్షణనిస్తారని చెప్పారు. ఈ తరగతులు 4వ తేదీ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిక్షణ తరగతులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు మధ్యాహ్నం భోజన సదుపాయం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణా జి, జెవివి జిల్లా పూర్వ అధ్యక్షుడు అల్లూరి శివ వర్మ, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కన్వీనర్ దప్పు శ్రీను, జిల్లా కోశాధికారి షిణగం శివాజీ,జిల్లా ప్రతినిధులు పి.షణ్ముఖరావు, సీరాపు శ్రీను పాల్గొన్నారు.

కే.జి.పూడిలో ఎన్టీఆర్ పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - వేపాడ :రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని కొండగంగుపూడి గ్రామంలో ఎన్టీఆర్ పెన్షన్ కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. గ్రామ సచివాలయం సిబ్బంది ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పరవాడ జగదీష్, ముమ్ములూరి సత్తిబాబు, ముమ్ములూరి సూర్యనారాయణ, బురగబోయిన సింహాద్రి, కేదాటి రాము,పాతబోయిన శ్రీను తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.పెన్షన్ల పంపిణీ సజావుగా సాగిందని, లబ్ధిదారుల నుంచి సానుకూల స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు.

గరివిడి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 100 రోజుల యాక్షన్ ప్లాన్ పరిశీలన

విశాలాంధ్ర- గరివిడి:పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ కె. మురళీకృష్ణ గరివిడి మండలంలోని గరివిడి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థుల కోసం అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్ను పరిశీలించి విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు.వారం వారం నిర్వహిస్తున్న పరీక్షల్లో షైనింగ్ స్టార్స్, రైజింగ్ స్టార్స్గా గుర్తించబడిన విద్యార్థుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ 100 శాతం హాజరు కొనసాగుతోందా, పరీక్షలు మరియు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక పగడ్బందీగా అమలవుతున్నాయా అనే అంశాలపై వివరాలు సేకరించారు. షైనింగ్ స్టార్స్ సంఖ్యను పెంచి మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ప్రధానోపాధ్యాయిని ఎం. నిర్మల్తో పాటు సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల్, ఉపాధ్యాయ సిబ్బంది, మండల విద్యాశాఖాధికారి పి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఎన్నికలపై అవగాహన

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్:ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూత్ కాంగ్రెస్ ఎన్నికల ప్రక్రియపై విజయనగరం డీసీసీ కార్యాలయం లో ఎలక్షన్స్ ఇంచార్జి దేన్నీస్ థామస్, డీసీసీ అధ్యక్షులు విద్యాసాగర్, డీవైసీ అధ్యక్షులు శ్రీనివాస్ పూడి ల ఆధ్వర్యంలో ఎలక్షన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.యూత్ కాంగ్రెస్ ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించబడుతున్నాయని నాయకులు తెలిపారు. మెంబర్షిప్ నమోదు, నామినేషన్, ఓటింగ్ ప్రక్రియలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన కాండిడేట్ హ్యాండ్బుక్ను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అర్హత కలిగిన యువత ఈ ఎన్నికల్లో పాల్గొని యూత్ కాంగ్రెస్ను గ్రామ స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు మరింత బలోపేతం చేయాలని వారు పిలుపునిచ్చారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించినప్పుడే ప్రజాస్వామ్యం బలపడుతుందని, మార్పుకు యువతే నాయకత్వం వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్లో 3 జిల్లాలు రిజర్వు కాబడగా విజయనగరం జిల్లా యుత్ కాంగ్రెస్ అ ధ్యక్షులు గా షెడ్యులు కులం వారికి రిజర్వు కాబడినది ,ఈ కార్యక్రమంలో ఏఐసీసీ మెంబెర్ రమేష్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ బంగారునాయుడు, జనరల్ సెక్రటరీ ఎస్. శ్రీనివాస్,అనిల్, బి వి రమన,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వంకే

ఎమ్మెల్యే బేబి నాయన

విశాలాంధ్ర - బొబ్బిలి : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ,రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు తిప్పి కొట్టాలని కూటమి ఎమ్మెల్యే బేబి నాయన పిలుపునిచ్చారు. బుధవారం పట్టణం మున్సిపల్ కార్యాలయం మున్సిపల్ చైర్మన్ చాంబర్ లో ఎమ్మెల్యే బేబి నాయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడు సంవత్సరాలగా సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు రాష్ట్రంలో అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలు సూపర్ సిక్స్ పథకాలు ఎన్నికల వాగ్దానాల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో పాటు 25శాతం అదనంగా సంక్షేమ పథకాలు శతశాతం అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వంకే దక్కిందని ఎమ్మెల్యే బేబీనాయన కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన నరేంద్ర మోడీ అండతో భోగాపురం ఎయిర్పోర్ట్ ఈనెల నాలుగున రన్వే జరుగుతుందని దీంతో ఉత్తరాంధ్ర శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం మన్యం జిల్లాలకు పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని చెప్పారు . ఉత్తరాంధ్రకు స్టీల్ ప్లాంట్, గూగుల్ సెంటర్, పరిశ్రమలు ఏర్పాటు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని అన్నారు. నియోజకవర్గ పరిధిలో గత ఐదు సంవత్సరాలు వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అస్మార్థత తో రోడ్లన్నీ పాడైపోయి రవాణా వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే కూటం ప్రభుత్వం బొబ్బిలి నియోజకవర్గం పరిధిలో రహదారణ నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగిస్తుంటే ప్రతిపక్ష పార్టీ చేసిన పనులు పైన నాశి రకం పనులు,అర కొర పనులు అంటూ విమర్శలు చేయడం సరికాదని విమర్శలను తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. పారాది బ్రిడ్జి ఏప్రిల్ మే నెలలో పూర్తిచేసి రాకపోకలు జరుగుతుందని తెలిపారు. 2026 సంవత్సరంలో గొల్లది బ్రిడ్జి నిర్మాణం కోసం, మున్సిపల్ లో తాగునీరు కోసం 123 కోట్లతో త్రాగునీరు పథకం అమల కోసం కృషి చేస్తామని దీంతో పట్టణ ప్రజలకు త్రాగునీరు సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని అన్నారు. ఇందిరమ్మ కాలనీలో 40 లక్షలతో విద్యుత్తు పనులు నిధులు మంజూరు అవుతున్నాయని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ శరత్ బాబు, టిడిపి పట్టణ అధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యులు వెలగాడ హైమావతి, బొత్స సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గీతాలాపన,అన్నమాచార్య సంకీర్తనలతో వైకుంఠుని సేవ

విశాలాంధ్ర- శృంగవరపుకోట : మండలంలో భర్తాపురం శ్రీ కళ్యాణ ప్రసన్న వైభవ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వైకుంఠ ఏకాదశిరోజు రాత్రిగీతాలాపన, అన్నమాచార్య సంకీర్తనలను అత్యంత భక్తి శ్రద్ధలతో చిన్నారులు, పెద్దలు ఆలపించారు. రెండు గంటలపాటు ఆద్యంతం మధురాలాపనతో తన్మయత్వంతో వైకుంఠుని సేవలో తరించారు. అరవై మందికి పైగా పాల్గొన్న ఈ బృందానికి కటకం పావని సారథ్యం వహించారు. వి.సుశీల, వి.లక్ష్మి, సిమ్ వ్యవస్థాపకలు బి.రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు, చదరం గణేష్, రత్న దంపతులు పాల్గొన్నారు. చిన్నారులందరికీ ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల జయవిష్ణు, ఈశ్వరరావు, జనరల్ నాలెడ్జి పుస్తకాలను బహుకరించి ప్రోత్సహించారు. అనంతరం యస్.కోట శ్రీ రామా కోలాట బృందం కోలాటాన్ని ప్రదర్శించారు.

యుటిఎఫ్ వాల్ క్యాలెండర్స్ , డైరీలు ఆవిష్కరణ

విశాలాంధ్ర-జామి: మండల విద్యాశాఖ అధికారి- 1 జె.జయశ్రీ, మండల విద్యాశాఖ అధికారి- 2 కె. గంగరాజుల చేతుల మీదుగా బుధవారం యుటిఎఫ్ వాల్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూ టి ఎఫ్మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జే.వి.ర్. కె .ఈశ్వరరావు , మండల గౌరవ అధ్యక్షులు కె. వెంకటరావు,మండల యుటిఎఫ్ అధ్యక్షులు వి. వా సుదేవరావు ,మండల యు టి ఎఫ్ ప్రధాన కార్యదర్శి వి. పైడిపు నాయుడు,మండల యూటీఎఫ్ సహాధ్యక్షులు ముత్యాలు , కార్యవర్గ సభ్యులు రఘు ,సూర్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి ఎంపీడీవో రామకృష్ణ

విశాలాంధ్ర -బాడంగి: బాల్య వివాహాలను రూపుమాపాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్యవివాహాల పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. చిన్న వయసులోనే వివాహం చేయడం వల్ల తల్లి బిడ్డ ఇద్దరు అనారోగ్యనికి గురు అవుతారని విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వరప్రసాద్, ఐసిడిఎస్ పిఓ వరహాలమ్మ, ఎస్సై తారకేశ్వరరావు, ఎంఈఓ లక్ష్మణ్ దొర, ఎంఈఓ రాజేశ్వరి, ఇంచార్జ్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు, కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఎల్ సత్యం తోపాటు పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

చికిత్స కోసం 30 వేలు అందించిన అప్పలరామిరెడ్డి

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో రెడ్డి కంచేరు గ్రామానికి చెందిన బైరెడ్డి సురేష్ కుమారుడు నెక్రోటైజింగ్ ఎంటెరోకోలైటిస్ అనే అరుదైన, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం విశాఖపట్నం ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో అత్యవసర చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. చికిత్స కోసం సుమారు రూ.12 లక్షలు అవసరమవుతాయని తెలిసిన వేళ ఆ కుటుంబంలో నిస్సహాయత అలుముకుంది. ఆ బాధను గమనించిన తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామి రెడ్డి మానవీయ స్పందనతో ముందుకు వచ్చారు. తన వంతు సహాయంగా రూ.30,000 నగదు అందజేస్తూ, బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు ఆదేశాల మేరకు ఈ సహాయం అందించానని తెలిపారు. చిన్నారి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించారు.

కాలంరాజుపేట లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

విశాలాంధ్ర- గజపతినగరం:మండలంలోని కాలం రాజుపేట గ్రామంలో బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కజొన్న పంట లో ఎరువులు మరియు చీడ పీడల యాజమాన్యం కొరకు సూచించారు. అలాగే యూరియా, డీఏపీ చల్లే స్థానంలో నానో యూరియా, నానో డి ఏ పి పిచికారి చేసుకున్నట్లయితే పంటకు బాగా ఉపయోగపడుతుంది అన్నారు. అదేవిధంగా పంట పూర్తిగా ఉపయోగించుకుంటుందని తెలిపారు. ఆరోగ్యం మెరుగుపడుతుందని, రైతుకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. కిరణ్ కుమార్, ఏ డి ఏ ఆఫీస్ వినయ్, వి ఎ ఏ, మరియు రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాలలో రీ సర్వే గ్రామసభలు

విశాలాంధ్ర -దత్తిరాజేరు :మండల పరిధిలో గల పాచలవలస, పప్పల లింగాలవలస గ్రామాలలో రీ సర్వే గ్రామసభలు బుధవారం రెవెన్యూ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా తహసిల్దార్ హరికిరణ్ మాట్లాడుతూ భూ సర్వేపై అవగాహన కల్పించి 2026 జనవరి 2 నుండి భూ సర్వే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేసారు.రైతులు అందుబాటులో ఉండి భూములను సరిచూ సుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుషిడి వేణు, సుంకరి సత్యం, దుప్పాడ చిన్నం నాయుడు, వైసీపీ నాయకులు సుమల గోవింద, ఆర్ ఎస్ డి టి రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు

సద్గురువు ద్వారానే భగవంతుని దయ

విశాలాంధ్ర -శృంగవరపుకోట: పట్టణంలో యోగచైతన్యధామం ఆధ్వర్యంలో రమణ మహర్షి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. భజనలు అనంతరం సంస్థ వ్యవస్థాపకుడు, ఆధ్యాత్మిక గురువు గోవింద రావు సత్సంగం ప్రవచించారు. సాధకులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈర్ష్యా ద్వేషాలను, హింసను విడవాలన్నారు. ప్రతీ ఒక్కరికీ తన జీవితంలో గురువు ఖచ్చితంగా ఉండాలి. సద్గురువు ద్వారానే భగవంతుని దయ పొందగలం అన్నారు. అనేక జన్మలలో మనం చేసుకున్న పూర్వ కర్మల పుణ్య ఫలితమే, ఇంత మంచి గొప్ప గురువుల ఆశీర్వాదం లభించడమన్నారు. ఈ కార్యక్రమంలో సిమ్ వ్యవస్థాపకులు బి. రామకృష్ణ, విజయలక్ష్మి దంపతులు, అధ్యాపకుడు కాల్ల గోవిందరావు, సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు. గురు ప్రభోధానంతరం అన్నప్రసాదవితరణ గావించారు. సుమారు వందమంది పాల్గొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు

విశాలాంధ్ర -విజయనగరం: జిల్లా పౌరసరఫరాల శాఖ లో ఆఫీస్ సబార్డినెట్ గా పని చేస్తూ బుధవారం పదవీ విరమణ చేసిన షేక్ ఇబ్రహీం కు జిల్లా రెవిన్యూ అసోసియేషన్ ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్ ఏ.ఓ దేవ్ ప్రసాద్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మురళి , రెవిన్యూ అసోసియేషన్ తరపునఅధ్యక్షులు తాడ్డి గోవిందు, జిల్లా సెక్రెటరీ సూర్య , ఇతర రెవిన్యూ సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. ఇబ్రహీం జిల్లాలో పనిచేసిన పలువురు కలెక్టర్ల వద్ద దఫేదార్ గా పని చేసి అందరి మన్ననలు పొందారని అధికారులు కొనియాడారు.